# సాయంకాలే వనాంతే....

"Boy ! 4 cups of coffee తీసుకురా" అన్నారు శశిభూషణ్‌గారు table మీద ఉన్న పేకముక్కలన్నీ దొంతి పెడుతూ.

"Why only four? ఏం, నాలుగు కప్పులే చెప్పారేం?" అడిగారు Police officer రాధాక్రిష్ణగారు, బెల్టు సర్దుకుంటూ.

"నే నింక ఆడలేను. క్షమించాలి. ఇంటి దగ్గర తాగుతాను." అన్నారు శశిభూషణ్, చిరునవ్వుతో table చుట్టూ ఒక్కసారి కలియజూస్తూ.

"I see ఈవేళ Sunday special గాబోలండి," అన్నారు వెటకారంగా కోటేశ్వరరావుగారు, పైప్‌లో పొగాకు పొడి దట్టిస్తూ.

"అబ్బె అదేమీ లేదండీ. నాకు ఈవేళ tour ఉంది. సాయంత్రం 4-45 ప్యాసింజర్‌కి వెళుతున్నాను." అన్నారు శశిభూషణ్ అదే చిరునవ్వుతో, లేవడానికి కుర్చీని కాళ్ళతో వెనక్కి నెట్టుతూ.

"సరిలెండి, అర్థమయింది. We should not trouble him at all. ఏదో కులాసాగా ఇంటిదగ్గర కబుర్లు చెప్పుకుంటూ, కాఫీ తీసుకుని బయలుదేరడానికి టైం సరిగ్గా ఉంటుంది, పాపం." అన్నారు డాక్టర్ మూర్తి నవ్వుతూ, పెదాల మధ్యనించీ వేల్లాడుతున్న సిగరెట్టుని రెండు వేళ్లతో బయటికి తీసి.

"Practically ఇంచు మించు మీరన్నదే correct." అన్నారు మందహాసంతో, శశిభూషణ్‌గారు, pant జేబులోనించి సిగరెట్టు కేసు బయటికి తీస్తూ.

"మీరు హోస్టుగా ఉన్న రోజునే మీరు మాతోపాటు coffee తీసుకోకుండా ఉండడం ఏమీ అంత బాగాలేదే,'' అన్నారు, రాధాక్రిష్ణగారు. తన రెండుచేతులూ కలుపుకుని తలవెనక పెట్టుకుని కుర్చీమీద వెనకకి జార్లబడుతూ.

"Sorry, brother, no time, excuse చెయ్యాలి," అన్నారు శశి. సిగరెట్టు నోట్లో పెట్టుకుంటూ.

"Good luck then. Get along!" అన్నారు అడ్వకేటుగారు పొగాకు పౌచ్ (సంచి) మడతపెట్టుకుంటూ.

"మనలాటి ఉద్యోగస్థులందరికీ ఈవేళ ఒక్కరోజూ కాస్త leave. అదీ అనుభవించడానికి వీలులేకుండా Mr. శశి ఈవేళే tour బయలుదేరుతున్నారు. We must leave him off" అందుకున్నారు లెక్చరర్ అబ్రహామ్‌గారు. తన lighterతో శశిభూషణ్ సిగరెట్టు ముట్టిస్తూ.

" అబ్బ! ఎంత ఉక్కగా ఉంది!" అన్నారు డాక్టర్ మూర్తి మెడదగ్గర ఉన్న slack button ఊడదీసుకుంటూ కుర్చీమీద వెనకకి జారిగిలపడి.

"Boy, fan బాగా విసురుగా వెయ్యి." కాస్త గట్టిగా అరిచారు, శశి, సిగరెట్టు పొగ బయటికి ఒదిలి.

"అవునండీ, సాయంత్రానికి వర్షం వస్తుందేమో!' అన్నారు అబ్రహామ్ గారు.

Tray లో కాఫీలు తెచ్చి బల్లమీద నలుగురి మధ్య, అప్పుడే పెట్టిన boy పంకా త్రిప్పడానికి వెళ్ళాడు.

"ఇదిగో కాఫీ వచ్చేసిందండి. Enjoy yourselves Sorry to miss your company" అన్నారు శశి వెళ్ళబోతూ, చిరునవ్వుతో నించుని, వేళ్ల మధ్య సిగెరెట్టు ఉన్న చేత్తో అరచెయ్యి పైకెత్తి "bye bye all of you. ఏమండోయ్ భద్రయ్య గారూ! ఉండనామరి?" అంటూ పొడిగించారు. ఆఖరు వాఖ్యం కాస్త బిగ్గరగా ఉండబట్టి, ప్రక్క ఇంకో table దగ్గర కూచున్న భద్రయ్యగారు ఉలిక్కిపడి, చేతిలో తెరిచిఉన్న Illustrated weekly పుస్తకంతోనే గబుక్కున వెనక్కి తిరిగి "మంచిది brother. ఆ! ఆc!" అన్నారు. ఆ విసురుకి తన ముందు table మీద ఉన్న ఎంగిలి కాఫీ కప్పు సాసరు మీదికి ఒరిగింది, పుస్తకం తగిలి. "Boy cups తీసెయ్యి అక్కణ్నించి" అని అరిచారు రాధాక్రిష్ణగారు, ఒక్క నిముషం ఆగి.

"వాడు ఇప్పుడెక్కడ పనిచేస్తాడండీ! అదిగో శశిభూషణ్ గారి స్కూటర్ తుడవడానికి పరిగెట్టాడు,'' అన్నారు కోటేశ్వరరావుగారు, చేతిలో ఉన్న పైప్‌తో శశిభూషణ్ వెళ్లినదారే చూపుతూ.

"శశిగారంటే ఆ బోయ్‌కి చాలా ఇష్టం." అన్నారు భద్రయ్యగారు.

"వాడికిమట్టుకేమిటి, club staff కి అందరికీ ఇష్టమే,'' అన్నారు రాధాక్రిష్ణగారు.

"చాలా కలుపుగోలుగా తిరుగుతారు, ఆయన," అన్నారు అబ్రహామ్‌గారు, coffee sip చేస్తూ.

"అసలు అనుచరులని దయగా చూస్తారల్లే ఉంది." అన్నారు భద్రయ్యగారు.

"డబ్బండీ! అంతా డబ్బులో ఉంది. బాగా సంపాదిస్తున్నారు బాగా ఇస్తారు,'' అందుకున్నారు డాక్టర్ మూర్తి, గబ గబ నాలుగు సార్లు సిగరెట్టు పీల్చి పెద్ద సిగరెట్టు ముక్కని అల్లాగే పారేసి కాఫీ కప్పు అందుకుంటూ.

"ఏడిసినట్టుగా ఉంది. అదొక show off. ఆయన ఎట్లా manage చేస్తున్నారో నాకు తెలియడంలేదు. ప్రొద్దస్తమానం చెమట ఓడుస్తాను నేను, నాకు జరిగేది లేదు అల్లాగ.'' అందుకున్నారు కోటేశ్వరరావుగారు, కాఫీ తాగడం ఆపి, చేతిలోఉన్న కప్పు మీదనించి.

క్లబ్బు ఆవరణలో బిల్డింగు ప్రక్కనించి టెన్నిస్ కోర్టులో నెట్ కడుతున్న మార్కర్లూ పిక్కర్లూ ఒకళ్ల నొకళ్లు గదమాయించుకోడం వినిపిస్తూంది. అప్పుడే ఇద్దరు మెంబర్లు టెన్నిస్ రాకెట్లు పుచ్చుకుని నిదానంగా నడుచుకుంటూ కోర్టు చేరుకుంటున్నారు. ఆవరణలో ఉన్న పూలమొక్కలకి జల్లెడ టిన్నుతో తోటవాడు స్వామి నీళ్లుపోస్తూ అప్పుడప్పుడు "తప్పురా, తప్పురా," అంటున్నాడు తన చిన్న 3 ఏండ్ల మనుమడు ఆకులు గిల్లేస్తూంటే.

"Here he is ! అదిగో వచ్చేస్తున్నాడులెండి వాడు!" అన్నారు అబ్రహాము గారు, తలమీద చెయ్యివేసి జుట్టు నిమురుకుంటూ.

"రా,రా, ఈ కప్పులు తీసెయ్యి" అన్నారు రాధాక్రిష్ణగారు. hankie తో చెమట తుడుచుకుంటూ.

"ఏమిట్రా అది, మొఘల్ షాదుషాలా రోజాపువ్వు వాసన చూచుకుంటూ, మరీ వస్తున్నావ్?" అడిగారు advocate గారు, నోట్లో pipe తీసి చేత్తో పట్టుకుని.

"ఏమీలేదండీ, గులాబీపువ్వు ఒక్కటి తీసుకున్నా." అన్నాడు club boy బిడియపడుతూ, చేతిలో పువ్వు జేబిలో కుక్కుకుంటూ.

"నీకు పువ్వెక్కడిదిరా?" అడిగారు రాధాక్రిష్ణగారు.

"భూషణయ్యగారు మన గేటుముందర పువ్వులు కొన్నారండి. అవ్వి వారి కర్చీఫ్‌లో మూటకట్టి ఇచ్చాను.'' అన్నారుboy ఎంగిలి కప్పులూ సాసర్లూ తీసుకుని tray లో పెట్టుకుంటూ.

"ఇంటికి తీసుకెళ్లుతున్నారల్లే ఉంది శశిభూషణ్‌గారు.'' అన్నారు, రాధాక్రిష ్ణగారు, వక్కపొడి నములుతూ.

"భలే సరసుడల్లే ఉన్నారే, ఆయన! ఇన్నాళ్లు కాపురంచేసి ఇప్పుడింకా మిసెస్‌కి పువ్వులు తీసికెళ్లి ఇస్తూంటే!'' అన్నారు కాస్త ఈర్ష్యతోకూడిన చిరునవ్వుతో, కోటేశ్వరరావుగారు.

"అదేమిటి? కాస్త వళ్లు బాగాలేకపోతే కాఫీకూడా పెట్టి ఇస్తారుట ఆయన." అందుకున్నారు డాక్టరు మూర్తి.

"ఏ భర్త చూడడు లెండి ఆ మాత్రం.' అన్నారు అబ్రహామ్‌గారు.

"అంతటితో ఆగలేదండి. అన్నం తినిపిస్తారుట కూడాను. ఆవిడకి కాస్త వళ్లు బాగాలేకపోతే. నేనుమాత్రం. మా ఆవిడకి ఎంత ఎల్లా ఉన్నాసరే కారియర్ తెప్పించి పారేస్తానుగాని చస్తే ఈ అడవా చాకిరీ ఏమీ చెయ్యను'' అన్నారు డాక్టర్ మూర్తి, చిరునవ్వుతో.

"అవునూ, ఇంత భోగట్టా మీకెల్లా తెలిసింది?'' అడిగారు అబ్రహామ్‌గారు.

"వాళ్ళ servant boy చెప్పాడు అంతే. లేకపోతే నాకెల్లా తెలుసు? వాడికి మరేంలేదు. రెండు టెర్రిలిన్ షర్టులు ఇచ్చాను. అందుకని అప్పుడప్పుడు dispensary కి వచ్చిపోతుంటాడు. బజారుకి వెళ్లేటప్పుడల్లా'' అన్నారు డాక్టర్ మూర్తి.

"ఇంట్లో పనికుర్రవాడే చెబితే తప్పకుండా ఆమాట నిజమే అయి యుంటుంది లెండి." అన్నారు కోటేశ్వరరావుగారు.

"అన్యోన్య దాంపత్యం అనుకుంటూ," అన్నారు రాధాక్రిష్ణగారు.

"ఏడిసినట్టుగా ఉంది మీరనే అన్యోన్య దాంపత్యం.'' ఎప్పటికైనా శశిభూషణ్ అయ్యవారు పెడదొక్కవలసినదే! ఆవిడకి సవితి పోరు రాసిపెట్టి ఉందట మా ఆవిడ అంటేనే?" అన్నారు కోటేశ్వరరావుగారు కాస్త వెటకారంగా.

"మీ ఆవిడా? మీ ఆవిడ కెల్లా తెలుసు శశిగారి భార్య? ఆవిడ బయటకే రాదుట గదా!" అడిగారు డాక్టరు మూర్తి, ఆశ్చర్యంగా.

"అదొక story లెండి. ఒకనాటి మధ్యాహ్నాం శశిభూషణ్ గారింటికి వెళ్ళాను. ఆయన్ని పిల్చుకుంటూ, అల్లా హాల్లోకి వెళ్ళేటప్పటికి, వాళ్ల మిసెస్ ప్రక్క రూములోనించీ పెరట్లోకి వెళుతూంది. అల్లా దూరంలోనించే కనిపించింది." అన్నారు అడ్వకేటు.

"ఆఖరుకి పూజ ఫలించిందన్నమాట. ఆవిణ్ణి చూడగలిగారన్నమాట మీరు." అన్నారు, వెటకారపు చిరునవ్వుతో, డాక్టరు మూర్తి.

"అబ్బో! అదేం, పెద్ద భాగ్యమా, బంగారమా? అవిడ నిద్రబోయి లేచినట్టుంది అప్పుడే, మంగళసూత్రాలు మెడమీదనించీ వెనక తిరిగి వీపుమీదికి జారిఉన్నాయి. అల్లా మంగళసూత్రాలు వీపుమీదికి పడకూడదట. సవితిపోరుట!'' అన్నారు కోటేశ్వరరావుగారు, ముక్కులోనించీ వదిలిన పొగ తానే చూచుకుంటూ.

"ఈ విషయం అంతా, మీరు, మీ ఇంట్లో చెప్పినట్టున్నారు.'' అన్నారు రాధాక్రిష్ణగారు.

"నాకు భయం ఏమిటండి? చెప్పడానికి? అందులోకి మా ఆవిడ మనుషుల్ని ఇట్టే గ్రహించేస్తుందిలెండి. భలే తెలివైంది. నేనీమాట చెప్పంగానే, వెంటనే నేను చూసివస్తానుండమని వెంటనే వాళ్లింటికి బయలుదేరింది.' అన్నారు కోటేశ్వరరావు గారు.

"ఆవిడ సరిగ్గా మాట్లాడిందా మీ మిసెస్‌తో? సాధారణంగా ఎవళ్ళతోనూ మాట్లాడదుట లెండి ఆవిడ." అడిగారు డాక్టరు మూర్తి.

"అసలు మా ఆవిడ వదుల్తుందా, ఏమిటి? ప్రశ్నలమీద ప్రశ్నలువేసి మొత్తానికి గుట్టంతా అడిగి పుచ్చుకుని మరీ వచ్చింది." అన్నారు కోటేశ్వరరావుగారు.

"భలే!'' అన్నారు డాక్టరు మూర్తి.

"ఆవిడేమంత గర్వి కాదుట, సిగ్గుగావాళ్ళు. అంత ఎక్కువ మాట్లాడదుట. ఆవిణ్ణి మా ఇంటికి రమ్మని పిల్చిందట మా ఆవిడ, తప్పకుండా వస్తా నందిట. ఈ శశిగారు ఎంత ఘోషా పెడతారో అప్పుడు చూడాల!'' న్వారు కోటేశ్వరరావు గారు.

"అతనే ఘోషా పెట్టాడని మనం ఎందుకనుకోవాలి?'' చిరునవ్వుతో అడిగారు రాధాక్రిష్ణగారు.

"That is also a point. ఆయన్నే అనడం ఎందుకు?" కలిపారు అబ్రహామ్ గారు.

"ఆవిడకి మనుష్యులతో కలవాలని ఎంతో ఉందండీ. మా ఆవిణ్ణి చూడంగానే ఎంతో ఆప్యాయంగా పలకరించిందట కూడాను. చదువుకున్న మనిషట. ఏదో ఇంగ్లీషు పుస్తకం చదువు తూందట. మా ఆవిడకూడా విషయం ఏమిటీ అని తెలుసు కోవాలని శబ్దం లేకుండా చటుక్కున్న లోపలికి వెళ్ళి పోయిందట." అన్నారు కోటేశ్వరరావుగారు సిగరెట్టు పుగ మధ్యలోనించీ.

"గట్టిదే మీ ఆవిడ!" అన్నారు డాక్టర్ మూర్తి.

"మా ఆవిడ ముచ్చట్లాడు తూంటే మధ్యన ఆవిడకి పెద్ద తలనెప్పి ఆరంభ మయిందట. అంత నెప్పితోనూ కాఫీ చేసి మా ఆవిడకి ఇచ్చి, అతని కోసం ఫ్లాస్కులో పోసి పెట్టిందట. మా ఆవిడకి ఒళ్ళు మండింది. ఆవిడకి ఇల్లాంటి వేషాలు అసలు గిట్టవు." పొడిగిస్తూనే ఉన్నారు కోటేశ్వరరావు గారు.

"అల్లాగా?'' అన్నారు డాక్టర్ మూర్తి.

"అవును. ఇంకెవ్వళ్లకీ మగళ్లు లేరా! ఇంకెవ్వళ్లకీ పెళ్లిళ్లు లేవా? ఈవిడ మహా గొప్పతనం పోతుంది. తనకి కాబట్టి ఇంత వైభోగం అన్నట్టూ ఆ కాఫీ చేస్తుంది. ఏం. అతను హోటల్లోతాగి రాలేడా ఆమాత్రం. ఒకనాడు?'' అని విసుక్కుంది. మా ఆవిడ, ఇంటికొచ్చి" అన్నారు కోటేశ్వరరావుగారు.

"ఆవిడ అల్లాచూడబట్టే, శశిగారు పువ్వులు కొనుక్కుని వెళుతున్నారను క్కుంటాను.'' మాట కలిపారు రాధాక్రిష్ణగారు.

"ఏమో! ఆవిడ అంత చాకచక్యంగల దేలాగుంది మరి. ఆఖరుకి మా ఆవిణ్ణే బుట్టలో వేసేసింది. వచ్చే బొమ్మల కొలువులో పాటలు కూడా పాడమని ఆవిణ్ణి invite చేసిందట. మా ఆవిడ. ఆవిణ్ణి తన వీణెకూడా తెచ్చి మరీ పాడ మందిట,'' అన్నారు కోటేశ్వరరావుగారు.

"అవును, అవును, ఆవిడ వీణె అద్భుతంగా వాయిస్తుంది.'' అన్నారు డాక్టర్ మూర్తి చటుక్కున.

"ఏమిటీ గ్రంథం చాలావరకూ ఉందే! మీకెల్లా తెలుసు. ఆవిడ వీణె వాయిస్తుందని?"

ఆశ్చర్యంగా వెటకారం చేశారు కోటేశ్వరరావుగారు-అతని ముఖంకేసి చూస్తూ, అర్థ యుక్తంగా చిరునవ్వుతో, నోట్లో పెట్టుకోబోతున్న సిగరెట్టు చేత్తోనే పట్టుకుని.

"ఎల్లా తెలు సేమిటి? అర్థం లేని ప్రశ్న. నేను స్వయంగా విన్నాను గనుక.''

"I see కాస్త విశదీకరించండి. మాబోటి నిర్భాగ్యులకి."

"ఆవీణె, ఆ కంఠ స్వరం, విననివాళ్లు నిర్భాగ్యులే నిజంగా.'' అనేసారు డాక్టర్ మూర్తి వదిలేసిన సిగరెట్టు పొగలోకి పైకి చూస్తూ చేతులు రొమ్ము కడ్డంగా పెట్టుకుని.

"ఏమిటి brother suspense మా పాపపు చెవుల క్కూడా పడ వేద్దురూ అసలు జరిగిన విషయం," అడిగారు కోటేశ్వరరావుగారు.

"శశిగారి ఇంటి ప్రక్కన నా Patient ఉన్నారు. అతనికి చాలా సీరియస్‌గా ఉంటే ఓనాడు వెళ్ళాను. అది సాయంత్రం. చీకటి పడు తూంది. Thermometer readingకి బయట open terrace మీదికి వచ్చాను." అన్నారు డాక్టర్ మూర్తి. ఒక్కక్షణం ఆగి, ఎక్కడి నించో అమరగానం వినిపించిం దనుకోండి. ఆ నాదాన్ని పట్టి, ప్రక్క పెరట్లోకి చూశాను, అప్రయత్నంగా.

"సాయంకాలే, వనాంతే కుసుమిత సమయే సైకతే చంద్రికాయాం...." అని, ఆవిడ ఆవీణె మీటుతూ తదేక ధ్యాసగా పాడుతూంటే-ఆమె తలలో వాడని పువ్వులు, ఆమె వెనుక ఉదయిస్తున్న చంద్రుడూ, ఆమె ప్రక్కన తులసికోట-నిజంగా ఏ సరస్వతో, రాధో అనిపించిందను కోండి. చాలా భక్తి పారవశ్యంతో పాడింది.

Of course నేను వెంటనే వెనక్కి తప్పు కున్నాననుకోండి.'' అన్నారు మూర్తి, ఏక ధాటిగా- తనే ఆ స్ఫురణలో పారవశ్యం అనుభవిస్తూన్నట్టు.

"ఊఁ! ఆ అమృత గానం ఏదో మాలాంటి వాళ్ళంకూడా విన బోతున్నాం లెండి. ఈ వచ్చే దసరాకి.'' అన్నారు, కాస్త ఈర్ష్యతోనూ, కాస్త వెటకారం తోనూ, కోటేశ్వరరావుగారు pipe ని తిరగేసి ash tray మీదగట్టిగా కొట్టి దులిపేస్తూ.

"ఇక ఈవిషయం ఆపేద్దాం." Let us start the game again.' అన్నారు రాధాక్రిష్ణగారు table మీద ఉన్న పేక ముక్కలన్నీ చేత్తో చేరుస్తూ.

"What ever it is, I think we should not discuss a married couple like that. పెండ్లి అయ్యి కాపురం చేస్తున్న వాళ్ళని గురించి మనం ఇంతగా చర్చించ కూడదు. పెండ్లి పవిత్రమైనది. Marriages are made in Heaven. వాళ్ళ Private Lives వాళ్లవి." అన్నారు కాస్త మందలింపు స్వరంతో. హెడ్ మాస్టరు మిస్టర్ అబ్రహామ్.

చేతిలో మేగజైన్ మూసేసి ప్రక్క టేబిల్‌మీద చటుక్కున పడేసి వీళ్ల టేబిల్ ప్రక్కకి తిరగబోతున్న భద్రయ్యగారు,"ఆఁ! ఏడిసింది లెండి పెళ్లి, పెడాకులునూ, అన్ని పెళ్లిళ్ళు పవిత్రంగానే ఉంటే ఇంక లేని దేమిటి?'' అన్నారు ఈసడింపుగా.

"అదేం అల్లా అన్నారు?" అడిగారు రాధాక్రిష్ణగారు. కలుప బోతున్న పేక చేతిలో అల్లాగే పట్టుకుని, కాస్త ఆశ్చర్యంతో.

"మరేమిటయ్యా లేకపోతే, అందరమూ వారం వర్జ్యం చూసేగా పెళ్ళాడేది. కొందరి పెళ్లిళ్ల ఎట్లా అఘోరిస్తయ్యో చూడండి.'' అంటూ వచ్చి, శశి భూషణ్ గారు ఖాళీ చేసిన కుర్చీలో కూచున్నారు, భద్రయ్యగారు. ఆయన స్వరంలో కొంత గాంభీర్యమూ, మనో వ్యధ పొడకట్టగానే, "ఏదో విషయం ఉంది, కాస్త మా చెవులనికూడా బడెయ్యండి," అన్నారు కోటేశ్వరరావుగారు, pipe నోట్లో పెట్టుకోబోతూ.

"ఆఁ! ఎంతదూరం పోవాలి. విషయం చెప్పటానికి. అడుగో మా రమణ రావుని చూడండి. అసలు నాకంతకంతకీ జాతకాలమీద నమ్మకమే పోతూంది,'' అంటూ. తను వదిలివచ్చిన టేబిల్ ప్రక్కన కుర్చీలో కూచుని పేపరు చదువు కుంటున్న యువకుణ్ణే చూపించారు చేత్తో.

"ఏమయిందతనికి?" అడిగారు డాక్టర్ మూర్తి.

"అంతా అయింది." అన్నారు విసుగ్గా. "పాపం, అర్భకుడు. మా తమ్ముడు బావమరిది లెండి. వాళ్ళ నాన్నగారు అమిత వైభవంగా పెళ్లిచేశారు. బాగా ఉన్న వాళ్ళనుకోండి. ఒక్కడే కొడుకు," అని చెబుతూ "నివ్విట్లా దగ్గరగా కూచో, నీ విషయమే చెబుతున్నాను," అన్నారు కాస్త హెచ్చు స్థాయిలో.

రమణరావు లేచి వీళ్ళకి దగ్గరగా ఉన్న ఇంకో కుర్చీలోవచ్చి కూచున్నాడు. Paper చేత్తోపట్టుకుని.

"బంధువుల్లోనే సంబంధమా? బయటవాళ్ళా?" అడిగారు అబ్రహామ్‌గారు.

"ఊం! బయట సంబంధమేనండీ! బొబ్బిలి." అందుకున్నారు రమణారావు గారు.

"What is the Trouble ? అసలు బాధేమిటి?" అడిగారు రాధాక్రిష్ణగారు.

"ఆ పిల్లని ఇంతవరకూ కాపరానికి పంపరు వాళ్లు." అన్నారు భద్రయ్యగారు.

"ఇతన్నే వచ్చి వాళ్లింటిలో ఉండమంటున్నారా ఏం?" అడిగారు, తిరిగి రాధాక్రిష్ణగారు.

"అదిగదే విషయం. అక్కడే వచ్చింది చిక్కు."

"ఏం, వెళ్లి ఉండకూడదూ? భార్యదగ్గర ఉంటే తప్పేముంది?" కలిపారు అబ్రహామ్‌గారు.

"భేషుగ్గా అన్నారే మేస్టరుగారు. ఇహను ఇతని తల్లితండ్రులని చూసేదెవరు, అవసానకాలంలో" అడిగారు, భద్రయ్యగారు.

"అదొకటే కాదులెండి." కొంచెం ఉద్రేకంగా అందుకున్నారు రమణారావుగారు. "వాళ్లింటికి వెళితే కుక్కకన్నా హీనంగా చూస్తారు వాళ్లు."

"అత్తగారింటికి వెళితేనే అంత అనుకోండి. కాని వీళ్ళ అత్తవారు మరీ భరించ లేరెవ్వరూ. అతీతం." అన్నారు భద్రయ్యగారు.

"ఆ idea చాలా old fashioned అనుకోండి. ఇప్పుడా వ్యత్యాసాలే లేవు

లెండి. హీనంగా చూసేవాళ్లు మన ఇంటికి వచ్చి కూడా చూడగలరు.'' They can create hell." అన్నారు డాక్టరు మూర్తి.

"అదీ నిజమే ననుకోండి. But, ఇతన్ని ఒక బానిసకంటే హీనంగా చూస్తారు వాళ్లు. అసలు ఆ పెళ్లాం ఇతనితో సరిగ్గా మాట్లాడనయినా మాట్లాడదు,'' అన్నారు భద్రయ్యగారు.

"అల్లాంటప్పుడు he can get a divorce. ఇతనికి విడాకు చీట్లు ఇప్పించవచ్చే." అన్నారు కోటేశ్వరరావుగారు, వెంటనే ఉద్యోగధోరణిలో.

"అదంత సుళువుగాదండీ! అసలు వాళ్ళిస్తేగా? దానికే ఇతడు ఇక్కడికి వచ్చిందసలు." వివరించారు భద్రయ్యగారు.

"I see! మరి వాళ్ళ ఉద్దేశం?'' Mr. అబ్రహామ్ అడిగారు.

"ఉద్దేశం ఏమిటి? వీడి ఆస్తి కావాలి. వీడొద్దు. అంతే!'' అన్నారు భద్రయ్య గారు.

"వాళ్ల కసలు హృదయం లేదండి. డబ్బు! డబ్బు! అంతే, ప్రేమ, మమకారం అంటే వాటి రంగేమిటి అని అడుగుతారు వాళ్లు!' అన్నారు రమణరావుగారు విసుగ్గా. ఆ అమ్మాయి ఏవేళ చూడండి ladies club entertainments, friends ఇవేగాని, ఇవతర వాళ్లు బ్రతికారా చచ్చారా అనే అజేలేదు!''

"వాళ్ల తల్లిదండ్రులు కాస్త బుద్ధి చెప్పకూడదూ?'' అడిగారు Mr. అబ్రహామ్, "కాపురం ఇలా పాడవుతూంటే?''

"సరిపోయింది. వాళ్ళంతా అంతే. ఆయనకి హృదయమే లేదు. ఆ పిల్ల తండ్రి అంటే ఇతని మామగారు - లంచాలు, లంచాలు; రెండుచేతులా సంపాదించాడు,'' భద్రయ్యగారు జవాబిచ్చారు.

"అసలు ఆయన డబ్బుకోసమే కూతుళ్ళకి పెళ్లిళ్లు చేసింది. ఆ విషయం ఆ ఊరంతా తెలుసు," అన్నారు రమణరావుగారు ఏదో ఆలోచిస్తూన్నట్టు కుర్చీలో వెనక్కి ఆనుకుని.

"అలాంటి సంబంధం ఎలా చేసుకున్నారు అసలు మీ నాన్నగారు?'' అడిగారు రాధాక్రిష్ణగారు.

"మహా బాగా అడిగారు, ముందర తెలుసా ఏమిటి? కారూ, కుక్కలూ, పనివాళ్ళూ, మిద్దెలూ, మేడలూ-ఎవరైనా మోజు పడతారు లెండి, వాళ్ళ సంబంధం.'' అన్నారు భద్రయ్యగారు.

"అసలు ఆ ఇంటికి అల్లు డైతేగాని వారి నిజస్వరూపం తెలియదులెండి." అన్నారు రమణరావు.

"బాగా చెప్పారు. మోసేవాడికి తెలుసు కావిటి బరువు.' అన్నారు Mr. అబ్రహామ్.

"ఇట్లా మీరు divorce అడిగితే వాళ్లింటో మిగత ఆడపిల్లలకి పెళ్లిళ్లవడం కష్టమే!" అన్నారు, రాధాక్రిష్ణగారు మామూలు ధోరణిలో.

"ఆ బుద్ధి, ఆ భయం వాళ్లకి లేనప్పుడు, ఇతని కెందుకూ?'' అన్నారు భద్రయ్యగారు.

"అసలు ఇంక పిల్లలు లేరు లెండి. నాకిచ్చిందాని తరువాత ఒక పెద్ద పిల్ల ఉంది. ఇద్దరే పిల్లలు. వాళ్ళిద్దరికీ మధ్య 10 ఏళ్ల తేడా ఉందిలెండి. ఆ పెద్దపిల్ల వీళ్ళందరినీ మించిన బ్రహ్మరాక్షసి.'' అన్నారు రమణారావు.

"అలాగా! My God! ఆవిడ మగడికీ ఇదే అవస్థ అన్నమాట.'' అన్నారు కోటేశ్వరరావు గారు, కాస్త వెటకారంగా.

"నిమ్మళంగా అంటారేం? అసలు ఆ అల్లుణ్ని దగ్గర ఉంచారేమిటి? అతన్ని అప్పుడే వెళ్లగొట్టారు. అదృష్టవంతుడు పారిపోయాడు,' అన్నారు రమణరావుగారు.

"అతనికి divorce ఇచ్చారన్నమాట" అడిగారు కోటేశ్వరరావుగారు.

"ఏడిసినట్టుగాఉంది, వాళ్లివ్వరయ్యా అంటే. ఇస్తే, అతని ఆస్తి అంతా వాళ్ల చేతికి ఎలా వస్తుంది?" అందుకున్నారు భద్రయ్యగారు.

"ఆయన అక్కడికీ. 1, 2 ఏళ్లు గుట్టు చప్పుడుకాకుండా సత్యానికి ఒత్తులు మింగి ఇహ తట్టుకోలేక, ఆఖరికి లేచిపోయాడు. ఆయన Provident Fund, Insurance అన్నీ ఆఖరుకి ఈ విడివే'' అన్నారు రమణరావుగారు.

"పాపం! ఎక్కడున్నారు ఇప్పుడాయన?" అడిగారు అబ్రహామ్.

"నాకేం తెలుసు? ఇది జరిగి అప్పుడే 12 ఏళ్లయింది. ఈ గుట్టంతా నా పెళ్లయ్యాక తెలిసింది నాకు, ముందర తెలిస్తే ఆ ఆడుసులో నేనెందుకు కాలేస్తాను," అన్నారు రమణారావు గారు.

"అవునులెండి. అదీ నిజమే.'' అన్నారు సానుభూతితో, రాధాక్రిష్ణగారు.

"ఎటొచ్చీ, ఆయన కాస్త నాకంటే అదృష్టవంతుడు. పోయే వాడు ఎదిరింటో ఒక పిల్లని లేవదీసుకు మరీ పోయాడు. మనకి ఆ అదృష్టం లేదు," అన్నారు రమణరావుగారు, కాస్త వెటకారపు చిరునవ్వుతో.

"ఏమీటీ? this is interesting,' అన్నారు కోటేశ్వరరావుగారు, కుర్చీలో కాస్త ముందరికి జరిగి అమిత కుతూహలంతో. "చెప్పరేం మరి?" అన్నారు మళ్లా, pipe గుప్ గుప్ మని రెండు సార్లు పొగ పీల్చి.

"అంత interest కీ కారణం లేదులెండి. ఆ అమ్మాయికి పెళ్లి అయి భర్తతో కాపురం చేస్తున్నదే," అన్నారు ఈసడింపుగా భద్రయ్యగారు.

"అది అసలు dangerous. పెద్ద ప్రమాదం." అన్నారు రాధాకృష్ణగారు.

"ఆ పిల్ల భర్తతో కాపురం చెయ్యకుండా పుట్టింటోనే ఉండిపోయిందట. పుట్టింటివారూ మహా మోతుబరులే....." పొడిగించారు రమణరావుగారు.

"ఇంకేం? అతనికి కాంతా, కనకం రెండూ చేజిక్కినయ్యల్లే ఉంది!'' చిరునవ్వుతో మాట మధ్యలోనే అందుకున్నారు కోటేశ్వర రావుగారు.

"అదేమీ లేదుట. ఆ పిల్ల ఒక్క చిల్లిగవ్వ పుట్టింటినించి తీసికెళ్లలేదుట. కట్టుబట్టలతో లేచిపోయిందట. వాళ్ళమ్మగారు ఒకసారి రహస్యంగా కబురు పెట్టిందట. "పెళ్లయినదానిని నీపేరు పోతుంది. పైగా, అతనూ పెళ్లి అయినవాడే. ఏనాటికైనా భార్య దగ్గరికి వెళ్లిపోతాడు. కనుక నీవంతు డబ్బు బ్యాంకులో వేస్తాం. గుట్టు చప్పుడు కాకుండా ఏ పట్నమైనా వెళ్లి హాస్టలులో ఉండి చదువుకో, ఎప్పటికైనా నీ కాధారం, అతన్ని నమ్మవద్దు, అని.'' అతను అలాగనక వదిలిపెడితే తను ఏదైనా తాగి చచ్చిపోతాననీ, అతను లేకుండా తను బ్రతకలేననీ తిరిగి కబురు బదులంపిందట-"ఇదీ ఆ పెద్దల్లుడు భోగట్టా," అన్నారు రమణరావుగారు.

"ఇతనికి వేరే పిల్లనివ్వడానికి ఎంతమంది కాచుకుని ఉన్నారని విడాకులు legal

గా ఇప్పించాలి. అంతే, మీ సలహాకూడా చాలా అవసరం ఉంది, కోటేశ్వరరావు గారూ," అందుకున్నారు భద్రయ్యగారు.

"దానికేముందిలెండి. easy. మాట్లాడుదాం," అన్నారు advocate.

"వాళ్ళంత easy గా divorce ఇస్తారా?" అడిగారు రాధాకృష్ణగారు.

"అదీ నిజమే. అమ్మ పెట్టాపెట్టదు, అడుక్కుతినా నివ్వదు అన్నట్టు వాళ్ళ ఏడిపించుకు తింటారు. అందుకనే మీ senior శేషయ్యగారిని మొదట కలుసుకుందామని అనుక్కుంటున్నాను. పైగా, వీళ్లకి ధన మదం ఒకటి'' అన్నారు భద్రయ్యగారు, కోటేశ్వరరావుగారి కేసి చూస్తూ.

"వాళ్లది అసలు తన కాయుష్యం తన ఆరోగ్యం అనే రకం. మా వదిన ఉన్నదే, తల్లికి అమ్మవారుపోస్తే, తనకి అంటుకుంటుందేమోనని, తన Nursing Home లోనే పండుకుందట. 10, 15 రోజులు," అన్నారు రమణరావుగారు.

"ఆవిడ డాక్టరా?" అడిగారు డాక్టర్ మూర్తి.

"డాక్టర్ సరళ. Sarala Nursing Home అండీ, బొబ్బిలి. నిర్దాక్షిణ్యంగా డబ్బు గుంజుతుంది ప్రజల దగ్గర." అన్నారు రమణరావుగారు.

"నాకా ప్రాంతాలతో పరిచయం లేదులెండి.'' అన్నారు డాక్టరు మూర్తి.

"Sad case! Divorce ఒక్కటే మార్గం ఈయనకి. Cards deal చెయ్యండి," అన్నారు రాధాకృష్ణ కోటేశ్వరరావుగారికేసి చూస్తూ.

టేబిల్‌చుట్టూ అందరూ నిశ్శబ్దంగా కూచున్నారు. ఎవరి పేకముక్కలు వాళ్ళ చేత నందుకున్నారు.

క్లబ్బు హాల్లో అన్ని పంకాలూ తిరుగుతూనే వున్నాయి. ప్రక్క పెద్దగదిలోనించీ ping pong అదే శబ్దం సన్నని గజ్జెలతో చెండాట లాడినట్టూ వినవస్తోంది. Billiards room నించి ఉండి ఉండి ఒకసారి మార్కరు స్కోరు చెబుతున్నాడు. ఆవరణలో టెన్నిస్ కోర్టులో good shot! fine ball! wonderful! అనే సంతోష నినాదాలు గాలిలో తేలి నలుదిక్కులా వినబడుతూన్నాయి. పేకాట టేబిల్ చుట్టూ నిశ్శబ్దం - పేకముక్కల కదలిక తప్ప. అందరూ ఆటలో నిమగ్నులయిపోయారు.

ఇంకా ఉక్కపోస్తూనే వుంది. తోటలో చెట్లమీద ఒక్క ఆకుకూడా ఆడడం లేదు.

కాస్సేపు గడిచాక ఘుమఘుమలాడుతూ క్లబ్ బోయ్‌వచ్చాడు. టేబిల్‌దగ్గరికి, "సార్! మీకు phone. Police Station నించే. అర్జంటుగా రమ్మనమని చెప్పమన్నారు. తిరిగి మిమ్మల్ని తిరిగి phone చెయ్యక్కర్లే దన్నారు.'' అన్నారు బోయ్ రాధాకృష్ణగారి కేసి చూస్తూ.

"Sorry. How to leave you all! అర్జంటుగా వెళ్ళాలి. All in the day's duty. ఇది మాకు పరిపాటే లెండి. అంటూ ఫటుక్కున లేచి బెల్టు సర్దుకుని ప్రక్క టీపాయ్‌మీద వున్న తన టోపీ తీసుకుని ఒక్క అంగలో బయట గుమ్మంలోకి వచ్చేశారు. వెనకనే గబగబ అంగలమీద భద్రయ్యగారుకూడా వచ్చేశారు. "రాధాకృష్ణగారూ నన్నూ మా రమణరావునీ కాస్త మీరు మీ స్టేషన్ వద్ద దిగపెట్టండి. అక్కడనించి ఒక్కరాయి విసురు వకీలు శేషయ్యగారి ఇల్లు. ఆయన్ని కలుసుకోవాలిగా ఇతని విషయం," అంటూనే కారుదగ్గరికి చేరారు.

"రండి, రండి! దానికేముంది? బంగారమా, భాగ్యమా," అంటూ ఒక్క క్షణంలో కారు వెనక తలుపు తీసి, తను డ్రైవరు సీటులో ఎగిరి కూచోడమూ, కారు స్టార్టు అవడమూ ఒక్క క్షణంలో జరిగిపోయినయి.

స్టేషనువద్ద బయట రోడ్డుమీద కాన్స్టేబిలు నించుని వున్నాడు. కారు ఆగీ ఆగక ముందే సెల్యూట్ చేసి, ఒక్క అంగలో కారు లోపలికి తలకాయపెట్టి, "అంతా అయిపోయింది. శశిభూషణ్‌గారు రైలుస్టేషనులో తల తిరిగి పడిపోయారు. Heart attack అన్నారు డాక్టరు. ఈసారి లాభంలేదుట,'' అన్నారు ఆతురత తో ఏకధాటిగా.

వెనక సీటులో భద్రయ్యగారు "ఆఁ!" అని నోరు తెరిచారు, గాభరాగా, రాధాకృష్ణగారికి కళ్ళు బయర్లు క్రమ్మినయి. నోరు ఎండిపోయింది.

"అయ్యో! పాపం. వాళ్ల ఇంటికి కబురెళ్లిందా?'' ఆతురతతో అడిగారు భద్రయ్యగారు.

శశిభూషణ్‌గారి ఇంట్లో హాల్లోకి వస్తూనే, "అమ్మా, ఎవరమ్మా ఇంట్లో?" పిలిచారు భద్రయ్యగారు.

"ఎల్లా మేనేజ్‌చేస్తారో మీరే చెయ్యాలి. నాకు నోరు రావడం లేదు," అన్నారు రాధాకృష్ణగారు.

"మనం నిజం చెప్పితేమట్టుకు ఇక్కణ్ణించీ కదపలేము. పాపం వస్తున్నట్టున్నా రావిడ. ఉండండి రాధాకృష్ణగారూ మీరు మరీ కాస్త గాభరాగా వున్నారు. మీరు కూచోండి." అన్నారు కుర్చీ చూపిస్తూ, భద్రయ్యగారు.

రాధాకృష్ణగారు, రమణరావుగారూ సోఫామీద కూచున్నారు. రాధాకృష్ణగారు చెమట తుడుచుకుంటూ, గడియారం చూసుకున్నారు. "ఇప్పుడే ఆరు అవవస్తోంది." అన్నారు.

లోపలినించీ గులాబీపువ్వుల వాసన వచ్చింది. శశిభూషణ్ గారి భార్య ప్రక్కగదిలో నించీ హాలులోకి తెర వత్తిగించుకుని వచ్చి చూసింది, "ఎవరండీ!" అంటూ.

"కొంచెం ఇల్లా రండమ్మా." అన్నారు భద్రయ్యగారు.

రాధాకృష్ణగారూ, రమణరావుగారూ ఛటుక్కున లేచి నుంచున్నారు. ఆవిడ చేతిలో నడుముకి ఆన్చి పూజపళ్లెం వుంది. "ఏమిటండీ?" అంది కాస్త మెల్లగానూ, ఆశ్చర్యంగానూ.

"అబ్బే ఏమీలేదండీ. శశిగారు కాస్త మైకం వచ్చి స్టేషనులో.... రైలుస్టేషనులో పడిపోయారు...." అన్నారు. మాటమధ్యనే, "మిమ్మల్ని.... మిమ్మల్ని...." అంటూ చేతులు నలుపుకుంటూ నుంచుని వున్నారు రాధాకృష్ణగారు.

"తీసికెళదామని అమ్మా. మీరు కాస్త తయ్యారు కావాలి," అన్నారు భద్రయ్యగారు.

"అదే.... అంతేనండి. మరేమీ భయం లేదు. కారు తెచ్చాము." అందుకున్నారు రాధాకృష్ణగారు.

శశిభూషణ్‌గారి భార్య ముఖం తెల్లబారింది. కాని, వెంటనే ధైరం తెచ్చుకుని, "అల్లాగేనండి, ఇదో వచ్చేస్తున్నాను. ఒక్క క్షణం దీపారాధన చేసి వచ్చేస్తాను. ఆయన దగ్గరికి. కొంచెం కూచోండి." అని చటుక్కున వెనక్కి తిరిగి దొడ్డివేపు వెళ్లింది.

ఇంట్లో దీపాలు వెయ్యలేదు ఇంకా. కాని, ఆ మునిమాపువేళ కనిచీకటిలో ఆమె వెనక మెడమీద జారిపోతున్నట్టూ ఒదులుజడలో నించీ, గులాబీ పూల గుత్తి వేళ్లాడుతూ కనిపించింది. "పాపం, శశి ఆశగా పువ్వులు కొన్నాడు,'' అంటూ భద్రయ్యగారుకూడా మూలకుర్చీలో చతికిలపడ్డారు.

లైటు స్విచ్ వెయ్యాలని ఎవ్వరికీ తోచలేదు.

ఒక్క క్షణం ఆగిన తరువాత, "భలేగా మేనేజ్ చేసారండి మీరు. మీరుగనక కూడా లేకపోతే, నాకు ఆవిడతో ఏమని చెప్పాలో, తెలిసేదేకాదు.'' అన్నారు రాధాకృష్ణగారు నిట్టూరుస్తూ.

"ఆc! ఎవ్వళ్ళమో ఒకళ్ళం ఆ పుణ్యం కట్టుకోవలసిందేగా. ఎంతసేపటికైనా, పాపం! మహా సాధువులాగుంది మనిషి. తీరా అతన్ని చూసి, నిజం తెలుసుకున్న తరువాత, ఈవిణ్ణి సముదాయించడం పెద్దపనే మనకి-వాళ్ళ బంధువులు వచ్చేవరకూ," అన్నారు భద్రయ్యగారు.

"కాని, మనం ఎంత మభ్యపెట్టినా, ఆవిడకి నిజం తెలిసి పోయిందేమో నని అనుమానంగా వుంది నాకు," అన్నారు రాధాకృష్ణగారు.

"అవును, నేను ఆమాట అనగానే, చూశారూ, ఆవిడ పళ్లెం పట్టుకున్న చెయ్యి వణికింది,'' అన్నారు భద్రయ్యగారు.

"అవును, నా కంటా పడ్డది. అసలు మనిషి పడిపోతుందేమో అనుకున్నాను- ఒక్క క్షణంలో తెప్పరిల్లిందిగాని,'' అందుకున్నారు రమణరావుగారు.

"అయినా, మగాడు మైకంగా పడిపోయాడు అన్న గాభరా మాట వింటే. ఏ ఇల్లాలికిమాత్రం కాళ్ళు చేతులు వణకవులెండి!'' అన్నారు భద్రయ్యగారు.

"ఆవిడ ఎంత బావురుమని ఏడుస్తుందో అని భయపడ్డాను.'' అన్నారు రమణరావుగారు.

"పిల్ల ధైర్యస్థురాలే లెండి.'' అందుకున్నారు భద్రయ్యగారు.

"అంటే మనం నిజం చెప్పలేదుగా. ఆయన పడిపోయారనే చెప్పాం. అబ్బ! పోయారు అనడానికే నాకు నోరు రావడం లేదు," అన్నారు. రాధాకృష్ణగారు, ఏదో తన ధ్యాసలోనించి అప్పుడే తల పైకెత్తి.

"మహా మంచివాడు సుమా శశి, ఎంత కలివిడి. ఎవ్వళ్ళకీ ఎన్నడూ కీడు తలపెట్టి ఎరుగడు. ఒకటి, ఒకటిన్నర సంవత్సరాల నించీ అతనితో మెసులు తూన్నామా మనం, ఏమో! ఏనాటి కేమో! ఈవేళ ఇంట్లో, రేపు మంట్లో అంటారే. ముమ్మాటికీ నిజం!'' అన్నారు భద్రయ్యగారు.

"మెల్లగా మాట్లాడండి. ఆవిడ పెరట్లోనించి రాగలరు.'' అన్నారు రమణరావు గారు.

అందరూ మౌనంగా ఉండిపోయారు. రాధాకృష్ణగారు ముందరికి వంగి తన కాళ్ళ boots చూసుకుంటున్నారు. భద్రయ్యగారు గడ్డం అరచేతిలో పెట్టుకుని, మోచెయ్యి కుర్చీ చేతి బద్దమీద ఆన్చి ఆలోచనగా కూచున్నారు. రమణరావు ఎదురుగా గోడకి తగిలించిఉన్న పటంలో జలపాతం చూస్తూ కూచున్నారు. బయట గాలి కాస్త సాగింది. హాల్లో గుమ్మం తెరలు బాగా ముందుకీ వెనక్కీ ఆడుతున్నాయి. ఎవ్వరూ కదలలేదు. కాస్సేపయింది. ఇల్లు చీకటయింది. గాలికి హాలు కిటికీ తలుపు కొట్టుకుంది. రమణరావు లేచి light స్విచ్ వేశాడు.

"అప్పుడే చీకటి పడుతూంది.'' అన్నారు భద్రయ్యగారు.

"బయట మబ్బు," అన్నారు రమణరావుగారు.

రాధాకృష్ణగారు చేతి గడియారం చూశారు. "చాలాసేపయింది ఆవిడ పూజకు వెళ్లి" అన్నారు.

"నేను పిలుస్తానుండండి-అమ్మా-అమ్మాయ్!'' పిలిచారు భద్రయ్యగారు.

జవాబులేదు. మళ్ళా గట్టిగా పిల్చారు.

"లోపల గదిలో ఏడుస్తోందేమో పాపం,'' అన్నారు రమణరావుగారు.

"కొంపదీసి ఈవిడికికూడా ఈ షాక్ వల్ల మైకం రాలేదు గదా. నేను పెద్దవాణ్ణి. కాస్త లోపలికి వెళ్లి చూసివస్తా." అంటూ భద్రయ్యగారు బయలుదేరారు. లోపలినించీ అమ్మా అమ్మా అని ఆయన పిలుపు హాల్లోకి వినవచ్చింది.

"ఆపద్ధర్మం, తప్పేమీలేదు. ఆవిడ నిజంగానే మైకంవచ్చి పడిపోయిందేమో. మనమూ వెళదాం పదండి లోపలికి,'' అన్నారు రమణరావు, లేచి తను దారితీసూ.

రాధాకృష్ణగారూ, రమణారావుగారూ ఆఖరి గది గుమ్మంలో ఉండగానే, పెరట్లో నించీ భద్రయ్యగారూ పిల్చారు.

"ఆవిడ ఇంట్లో లేదర్రా, ఆతురతలో, మనకి చెప్పకుండా ఇల్లా ఈ దారిని వెళ్లిందేమో!"

రాధాకృష్ణ, రమణరావు పెరట్లోకి వెళ్ళారు, విసురు విసురుగా. పెరట్లో, కనిచీకటిలో చెట్లన్నీ కాస్త నల్లకప్పేసినట్టూ కనిపించినయి. తులసికోట ముందు ధగ ధగ మెరుస్తూ, పూజ పళ్లెం పెట్టింది. జ్యోతి వెలుగుతూంది.

"ఈవిడ దీపారాధన చేసింది. మరి మనిషి ఆజలేదు!'' అన్నారు భద్రయ్యగారు ఆలోచనగా గడ్డం తడుముకుంటూ.

"దొడ్డి గుమ్మం తెరిచిఉందేమో చూడండి. రమణరావు గారూ,'' అన్నారు రాధాకృష్ణ. రమణరావు పరిగెట్టుకుంటూ వెళ్ళి "గొళ్ళెం లోపలినించీ వేసి ఉందండీ," అని బిగ్గరగా అరిచాడు.

"అయ్యయ్యో! ఇదేమిటి ఆశ్చర్యంగా ఉందే!'' అన్నారు కాస్త గాభరాగా భద్రయ్యగారు.

పైన మబ్బులు కూడుకుంటూన్నాయి. కనిచీకటి దట్టమవుతూంది.

ఒక్క అంగలో, రాధాకృష్ణ తులసి కోటకి ఎదురుగా ఉన్న నూతిదగ్గరికి వెళ్ళి వంగి చూశారు. చీకటి, నీళ్లుకూడా సరిగ్గా కనబడటంలేదు. వెంటనే టార్చి వేశారు. నూతి మధ్య నీళ్ళల్లో గులాబిపూల గుత్తి తేలి ఆడుతూంది.

వెర్రిగా ఒక్క కేక పెట్టారు. రాధాకృష్ణ, "రండి, భద్రయ్య గారూ! ఈవిడ కొంప తీసేసింది! నూతిలో పడిపోయింది."

"శివ! శివ! ఇదేమిట్రా దేముడా!'' అరుస్తూ, భద్రయ్యగారు నూతి గోడదగ్గరికి అంగవేసారు. వెనకనే రమణరావు పరుగెట్టి కొచ్చాడు. "ఏం చేద్దాం?" అని పిచ్చిగా అరుస్తూ.

"ఫోను, టెలిఫోను, స్టేషన్‌కి ఫోను చెయ్యాలి. అని అరుస్తూ పరిగెట్టబోయి తిరిగి వెనక్కి వచ్చి చూరున ఉన్న త్రాళ్లు లాగబోయారు, రాధాకృష్ణ వెర్రిగా.''

పైన ఆకాశంమీద తళుక్కుమని తీగ మెరుపు ఒక్కటి మెరిసింది. ఛటుక్కున తులసి కోటా దొడ్డి ఆవరణా అంతా చిన్న వెలిగిచ్చింది. భూమిమీద-ఒక్క త్రుటి పాటు.

తులసికి ముందర సన్నగా ఎర్రగా గీతలు కనిపించినయి-ఆ తీగె మెరుపే ఆ గీతలు గీసి వెనక్కి మాయమై పోయినట్టు.

రాధాకృష్ణగారు టార్చి వేశారు. నెత్తురు క్రమ్మిన గీతలలా గున్నాయి అవి - ఎర్రగా.

ఆయనకి తల తిరిగినట్టవుతూంది. ఏదీ అవగాహన కావటం లేదు. "ఏమిటీ గీతలు?" గీతలు కావు అవి. అక్షరాలు - కుంకుమతో వ్రాసిన మాటలవి. ఇంకా పరకాయించి చూశారు. టార్చి వెలుగులో.

"తంతి ఇవ్వండి. డాక్టర్ సరళ. సరళ నర్సింగు హోము, బొబ్బిలి. ఆవిడ మావారి భార్య." చదివారు రాధాకృష్ణ బిగ్గరగా.

పైన ఫెళ ఫెళ మని ఉరుము గర్జించింది. ఛట ఫట మని చినుకు లారంభమయినయి.

తులసి కోటముందరి దీపం అటూ ఇటూ ఊగుతూ వెలుగుతూంది - చినుకులని తప్పించుకుంటూ.

❀ ❀ ❀